

ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

పార్వతీపురం/సీతంపేట రూరల్,ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ... శనివారం పార్వతీపురం ఐటీడీఏలో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులంతా హాజరవుతారని, ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూడాలని ఆదేశించారు. మరోవైపు సీతంపేట గ్రీన్‌ఫీల్డ్ మైదానంలో ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఎంతో ప్రత్యేకం.. గిరిజనుల జీవన విధానం
- ఆశ్చర్యపరిచే ఆచార వ్యవహారాలు
- ఆకట్టుకునే సంస్కృతి, సంప్రదాయాలు
- విభిన్న ఆహారపు అలవాట్లు
- నేటికీ వ్యవసాయంపైనే ఆధారం
- అడవితల్లి నీడలో బతుకువేట
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

ప్రకృతి ఒడిలో.. ఆదివాసీ జీవనం!



అటవీ ఉత్పత్తులను వారపు సంతకు తీసుకొస్తున్న గిరిజనులు (ఫైల్)

సీతంపేట రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల జీవనశైలి ఎంతో ప్రత్యేకం. ఆశ్చర్యపరిచే ఆచార వ్యవహారాలు.. ఆకట్టుకునే సంస్కృతి.. సంప్రదాయాలు.. విభిన్న ఆహారపు అలవాట్లు.. కష్టించే మనస్తత్వం వారి సొంతం.. వ్యవసాయమే వారికి జీవనాధారం. కొండ కోనల్లో నివసించే గిరిబిడ్డలు... నిత్యం అడవితల్లి ఒడిలో బతుకువేట సాగిస్తుంటారు. కొండపోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల ద్వారా వచ్చే డబ్బుతో సంతల్లో వారానికి సరిపడా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. నేటికీ మూలికా వైద్యమే వారికి రక్ష. నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలో గిరిపుత్రుల జీవన విధానం, వారి స్థితిగతులను ఇప్పుడు తెలుసుకుందాం..

కష్టించే మనస్తత్వం

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో మెజార్టీ గిరిజనులు గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, సాలూరు, మక్కువ, పాచిపెంట, సీతంపేట మండలాల్లో ఉన్నారు. సవర తెగ గిరిజనులు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జాతాపు కొండదొరలు పోడుతో పాటుగా మెట్ట వ్యవసాయం చేస్తున్నారు. జాతాపు, సవర, కొండదొర తెగలకు చెందిన వారే మన్యంలో అధికంగా ఉన్నారు. జంతు బలులు ఇచ్చే సంప్రదాయం నేటికీ కొనసాగుతుంది. ప్రతి గిరిజన గ్రామంలో ఎనోడు, దిసరి అనే ఇద్దరు వ్యక్తులు ఉంటారు. పండుగల నిర్వహణకు వారే ముహూర్తాలు తీస్తుంటారు. సీతంపేటలో అత్యధికంగా సవర, జాతాపు, గదబకు చెందిన గిరిజనులు ఎక్కువగా జీవిస్తున్నారు. వీరు ఏడాది పొడవునా నిర్వహించుకునే పండుగలు, పంటలు ఇతరాత్ర అంశాలపై ఓ కాల చక్రాన్ని తయారుచేసుకున్నారు. అందులో వీరు ఎప్పుడు ఏది చేయాల నేది వివరించి ఉంటుంది. దానికి అనుగుణంగా వీరు వ్యవహరిస్తుంటారు. ప్రాంతాలను బట్టీ వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు మారుతుంటాయి.



ఆదివాసీలు తయారుచేసుకున్న కాలచక్రం

వింత ఆచారాలు..

ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టేవి వారి వింత ఆచారాలే. వాళ్ల పూర్వీకుల అనుగ్రహం కోసం వింత ఆచారాలతో వీరు చేసే పూజలు అందర్నీ ఆశ్చర్యపరుస్తాయి. ప్రధానంగా ఆదివాసీలు ఆగం, పులి, విత్తన, కందికొత్తల, అమ్మోరమ్మ, జన్నిరాజు, కొండదేవత, టెంక, బాలే కొత్త పండుగ వంటి వాటికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి పితృదేవతలను ఆరాధిస్తారు.

ఏడాది పొడవునా పండుగలు..

సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీలు ఏడాది పొడవునా పండుగలు చేసుకుంటారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాల్లో భాగంగా వారి ఇష్టదైవాలను ప్రార్థిస్తారు. ప్రత్యేక వేషధారణలతో సందడి చేస్తారు. ఆడ, మగ అంతా కలిసి థింసా, గుర్రపు నృత్యాలు చేస్తారు. గిరిజన యువత డప్పు, తుడుము వాయిద్యాలతో సందడి చేస్తారు. అందరూ కలిసి పూటుగా మద్యం తాగుతారు. గ్రామంలో ఎవరి ఇంట శుభకార్యమైనా వారికి తోచిన సహాయం చేస్తుంటారు. అంతేకాకుండా వీరు ఇప్పటికీ పాతకాలం నాటి వంట పాత్రలను వినియోగిస్తారు. వాటిలో వండడం వల్ల పోషకాలు ఎక్కువగా లభిస్తాయనేది వారి నమ్మకం.

సాగు.. పంటలు ఇలా..

- ఆదివాసీలు ఇప్పటికీ పాత పద్ధతులననుసరించే వ్యవసాయం చేస్తుంటారు. నాగలి, పూదు, పార, గునపం, జిగ్గికత్తి,కోండి గొడ్డలి, కొడవలి, బాడిత, కొంటెకర్ర, కంక, బొరిగ వంటి వాటితో వ్యవసాయ పనులు చేస్తుంటారు. తక్కువ

(మిగతా 8వ పేజీలో...)



ఆదివాసీలు నివసిస్తున్న గిరిశిఖర గ్రామం ఎగువ వలగజ్జిగూడ

వైసీపీ చేష్టలను
ఉపేక్షించేది లేదు
- డీసీసీబీ చైర్మన్ నాగార్జున

7లో

బడుగు, బలహీన వర్గాల
అభ్యున్నతే ధ్యేయం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

8లో

ఏజెన్సీలో
కార్డన్ సెర్చ్



7లో

వరలక్ష్మీ కరుణించు!

- భక్తిశ్రద్ధలతో వ్రతాలు, పూజలు
- అమ్మవారి ఆలయాలు కిటకిట
- వెల్లివిరిసిన శ్రావణ శోభ



పూజలందుకున్న కోటదుర్గమ్మ



పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

పాలకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా జిల్లావాసులు ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు చేశారు. మహిళలు ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన ఆహార పదార్థాలు, పిండి వంటలను వండి నైవేద్యంగా సమర్పించారు. ఆ తర్వాత ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు, పూజలు చేశారు. చిన్నారులకు అన్నప్రసాదన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. కాగా అంతకుముందు సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇక సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలతో పాటు 15 మండలాల్లోనూ అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అంతటా శ్రావణ శోభ వెల్లివిరిసింది.

మూణ్నాళ్ల ముచ్చటే..
- రామభద్రపురం హైస్కూల్ ప్లస్‌లో చేరేందుకు విద్యార్థుల విముఖత
- బాడంగికి తరలింపు



8లో

కొరియాలో ఒడిశా డిప్యూటీ సీఎం పర్యటన

బొబ్బిలి రాజా రంగారావు
శతజయంతి



8లో

గిరిజనుల అభివృద్ధికి కృషి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం ఐటీడీఏ ప్రాంగణంలో అడవితల్లి విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

పార్వతీపురం/ బెలగాం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గిరిజనుల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పార్వతీపురంలో ఐటీడీఏలో ఒకరోజు ముందుగా ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో తొలుత అడవితల్లి విగ్రహానికి సంప్రదాయబద్ధంగా ప్రథమ పూజ, క్షీరాభిషేకం నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ అడవితల్లి విగ్రహానికి నూతన వస్త్రాలు, సారెను సమర్పించారు. డప్పు కొట్టి సందడి చేశారు. గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... కల్మషం లేని అమాయక గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యంతో పాటు జీవనోపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలుచేస్తున్నారని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని జీవన విధానం మెరుగుపరుచుకోవాలని సూచించారు. గిరిజనుల సమస్యలు పరిష్కారానికి ఐటీడీఏ, జిల్లా యంత్రాంగం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. ఆ తర్వాత కలెక్టర్, ఇన్‌చార్జి పీవో విలువిద్య పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మురళీధర్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఆర్.కృష్ణవేణి, డీఐవో పి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ

సోదర ప్రేమకు ప్రతీక రాఖీ

- నేడు రాఖీ పౌర్ణిమ



6లో

గిరిజన గ్రామాలకు
రూ.145 కోట్లు

- రహదారుల నిర్మాణానికి ఇచ్చిన ప్రభుత్వం
- మౌలిక వసతులకు పెద్దపీట
- వైసీపీ సర్కారు హయాంలో తీవ్ర నిర్లక్ష్యం
- చంద్రబాబు సీఎం అయ్యాక ప్రత్యేక శ్రద్ధ



అదే తీరు.. అనేక ఆరోపణలు!

- జిల్లాలోనూ గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్ బాధితులు
- గతంలో మన్యంలో విధుల నిర్వహణ
- పలు కేసుల నమోదు
- తాజాగా ఏసీబీకి చిక్కడంతో వెలుగులోకి నాటి సంగతులు



పార్వతీపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్ తన చాంబర్‌లో ఓ కాంట్రాక్టరు నుంచి భారీగా లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి దొరికిపోయిన విషయం తెలిసిందే. ఏకలవ్య పాఠశాల భవనాల బిల్లుల మంజూరుకు రూ.5కోట్లు డిమాండ్ చేసి.. చివరకు ఆఫీసులోనే రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. కాగా జిల్లాలో ఆయన పనిచేసిన కాలంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఎంతోమంది బాధితులు కూడా ఉన్నారు. 1994లో పార్వతీపురం ఐటీడీఏలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా శ్రీనివాస్ పనిచేశారు. అప్పట్లో ఈఏఎస్ గ్రాంట్ కింద రూ.ఐదు లక్షల అంచనాతో మావుడి నుంచి నంద వరకు రోడ్డు పనులు చేపట్టారు. అయితే అధికారిక రికార్డులను నిర్దేశించిన విధానాలను పాటించడంలో

(మిగతా 8వ పేజీలో...)

ఇది కాలువే..

గరుగుబిల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇది జంఝావతి ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాలువ పరిస్థితి. గరుగుబిల్లి మండలంలోని కొత్తవలస సమీపంలో కొన్నాళ్లుగా ఇలానే దర్శనమిస్తోంది. ఖరీఫ్‌కు ముందుగా కాలువల పరిధిలోని గుర్రపు డెక్కను తొలగించలేదు. దీంతో సాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. శివారు ప్రాంత రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏటా ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా.. ఎవరూ స్పందించడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జంఝావతి కాలువల నుంచి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ పూజలు


ఎస్‌కోట: దుర్గాదేవికి పూలతో అలంకరించిన దృశ్యం


కొత్తవలస: సంతోషిమాత ఆలయంలో అమ్మవారి అలంకరణ


పైడిమాంబకు గాజులతో ప్రత్యేకాలంకరణ


సాలూరు రూరల్: సంతోషిమాతను కరెన్సీతో అలంకరించిన దృశ్యం


ఎస్‌కోట రూరల్: పసుపుకొమ్ముల అలంకరణలో కొట్టాం కోటమ్మతల్లి


వీరఘట్టం: కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు


నెల్లిమర్ల: పసుపు కొమ్ములతో అలంకరించిన అమ్మవారు


చీపురుపల్లి: గాజుల అలంకరణలో శ్రీకనకమహలక్ష్మి అమ్మవారు

విజయనగరం/విజయనగరం రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలు వరలక్ష్మీ వ్రతాలను చేశారు. ముఖ్యంగా మహిళలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసంలో వచ్చే మంగళ, శుక్రవారాలు ఎంతో లక్ష్మీదేవికి ఎంతో ప్రీతిపాత్రమైనవని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల్లోని లక్ష్మీ, దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. విజయ నగరంలోని మూడు లాంతర్లు వద్ద ఉన్న పైడిమాంబ చదురుగుడి, రైల్వేస్టేషన్ రోడ్డులోని వనంగుడి, సంతోషి మాత ఆలయం, కన్యకాపరమేశ్వరి, రింగు రోడ్డులోని జ్ఞాన సరస్వతి, అయ్యన్నపేట లోని అష్టలక్ష్మీ ఆలయాలకు భకులు పోటెత్తారు. పైడిమాంబ ఆలయమాన్ని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు.


భామిని: బత్తిలిలో సంతోషిమాత అమ్మవారికి అభిషేకం చేస్తున్న దృశ్యం


సాలూరు రూరల్: కామాక్షి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


బొబ్బిలి: బంగారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


బొబ్బిలి: కంచరవీధి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువు తీరిన అమ్మవార్లు



సారె సమర్పిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

వాసవీ మాతకు సారె సమర్పణ

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు విజ్ఞపు విజయ్ ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా చీర, సారె కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి పట్టు వస్త్రాలు, 52 రకాల పిండివంటలతో సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అలవిల్లి శేఖర్, ప్రతినిధులు ఈవీ కృష్ణారావు, చంద్రశేఖర్ గుప్తా, శంకరరావు, సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


తుమ్మికాపల్లిలో ఎండిపోయిన వరి నారు

'ఎండి' పోతున్నాయి

గజపతినగరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఆదిలోనే రైతులు కష్టాలను ఎదురు చూస్తున్నారు. చినుకురాలక.. చెరువుల్లో నీరులేక వరి నారుమడులు ఎండిపోతుంటే రైతులు వాటిని రక్షించుకోలేని పరిస్థితి ఎదురవుతోంది. దీంతో రైతులు ఈ ఏడాది వరి పంటలపై ఆశలు వదులుకోవాల్సిందేనేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుమ్మికాపల్లి, లోగిస, లింగాలవలస తదితర గ్రామాల్లో వరి నారుమడులు ఎండిపోతున్నాయి. మోటార్లు పెట్టి నారుమడులను, రక్షించుకుందామంటే చెరువుల్లో నీరులేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన గ్రామాలకు రూ. 145 కోట్లు

నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గిరిజన గ్రామాలు నేడు అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్నాయి. చంద్రబాబు సీఎం అయిన తర్వాత వారి గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ గ్రామాలకు రోడ్లను మొదలుకుని మౌలిక సదుపాయాల కల్పన వరకు తాము గతంలో ఇచ్చిన హామీలను నెరవేస్తున్నారు. శనివారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని కథనం..

- రహదారుల నిర్మాణానికి ఇచ్చిన ప్రభుత్వం
- మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్న వైనం
- గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్రమైన నిర్లక్ష్యం
- చంద్రబాబు సీఎం అయ్యాక ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పార్వతీపురం, సాలూరు, కురపాం, పాలకొండ నియోజకవర్గాలున్నాయి. వీటి పరిధిలో రెండు ఐటీడీఏలు ఉన్నాయి. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 1,87,829 మంది, సీతంపేట ఐటీడీఏ పరిధిలో 35,182 మంది గిరిజనులు ఉన్నారు. వీరు కాకుండా మైదాన ప్రాంతాల్లో 37,408 గిరిజనులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వీరంతా నిరాదరణకు గురయ్యారు. గ్రామాలకు రోడ్డు సౌకర్యంలేక అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గిరిజనుల సమస్యలను ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తోంది.

రహదారుల నిర్మాణం..

డోలీల మోత లేకుండా రోడ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో మొదటి విడతగా వంద రహదారులు నిర్మించేందుకు రూ.145 కోట్లు మంజూరు చేసింది. ఇందులో 40 రహదారులు పూర్తికాగా.. మరో 60 వరకు నిర్మాణంలో ఉన్నాయి.

- గర్భిణి వసతిగృహాలు ద్వారా అందించాల్సిన సేవలను మెరుగుపర్చే చర్యలు ప్రభుత్వం చేపట్టింది. సీతంపేట మండల కేంద్రంగా మరో వసతిగృహాన్ని నిర్మించింది. గిరిజన ప్రాంతాల్లో మాతా శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకుంది.
- వైసీపీ హయాంలో నిత్యావసర సరుకులు అందక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం చంద్రబాబు సర్కారు గిరిజన గ్రామాలకు సరుకులు వెళ్లేలా గిరి బజార్ వాహనానలు ఏర్పాటు చేసింది.
- వైసీపీ హయాంలో సీతంపేట, పార్వతీపురంలో ఆసుపత్రుల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో సాలూరు ఏరియా ఆసుపత్రి పనులు కూడా ఉన్నాయి. కానీ ఆసుపత్రుల నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. శంకుస్థాపన చేసి నిర్మాణాలను మరిచారు. తర్వాత కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీతంపేట, పార్వతీపురంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు చేపట్టారు.


కొమరాడ మండలంలో సవరంగపాడు నుంచి బిన్నిడి కొండశిఖర ప్రాంతానికి వేసిన రహదారి

- గత ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాలపై తీవ్ర నిర్లక్ష్యం వహించారు. జలజీవన్ మిషన్ పథకం పనులు మధ్యలో నిలిచిపోయాయి. చంద్రబాబు సీఎం అయ్యాక గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు.
- రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గిరిజన ప్రాంతాల్లో కంటైనర్ ఆసుపత్రులను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సాలూరు నియోజకవర్గంలో రెండు ఏర్పాటు కాగా.. ఇవి కొండశిఖర గ్రామాలకు వైద్యసేవలు అందిస్తున్నాయి.

అభివృద్ధికి పెద్దపీట..

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు చేస్తున్నాము. డోలీల మోత కనిపించకుండా రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయి. తాగునీరు, వైద్యం, విద్య పూర్తిస్థాయిలో అందిస్తున్నాం.

-గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి

- మా ప్రభుత్వం గిరిజనుల పక్షపాతి. నియోజకవర్గంలో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశాము. తాగునీరు, వైద్యం, విద్య పూర్తిస్థాయిలో అందించడమే లక్ష్యం.

-తోయక జగదీశ్వరి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, కురుపాం

- సీతంపేటలో గర్భిణుల వసతిగృహాన్ని ఏర్పాటు చేశాం. అనేక గ్రామాలకు పక్కా రహదారులు నిర్మించాము. గిరిజనుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాము.

-నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ

- డోకిశిల గ్రామం నుంచి ములగ వరకు రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశాం. బలిజపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల్లోని గిరిజన గ్రామాలకు రోడ్ల నిర్మాణం చేపట్టాము.

-బోనెల విజయచంద్ర, ఎమ్మెల్యే, పార్వతీపురం

జిల్లా అభివృద్ధే లక్ష్యం..

జిల్లాలో అత్యధికంగా గిరిజన ప్రాంతాలు ఉన్నాయి. అక్కడ మౌలిక వసతుల కల్పనతో పాటు గిరిజనులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాము. వైద్యం, విద్య, తాగునీరు, సాగునీరు, రహదారులు వంటి వాటిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. సీసీఆర్ నిధుల ద్వారా ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేశాం.

-ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా కలెక్టర్

సోదర ప్రేమకు ప్రతీక రాఖీ

● నేడు రాఖీ పౌర్ణిమ

రాజాం రూరల్/ సాలూరు రూరల్/విజయనగరం కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో అత్యంత మధురమైన బంధం తోబుట్టువులది. అన్నాచెల్లెలు.. అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా నిలుస్తుంది రాఖీ పండుగ. సోదరికి తోడుంటానని సోదరుడు భరోసా ఇచ్చేదిగా రక్షాబంధన్‌ను చెప్పుకుంటారు. నీకు నేను రక్ష.. నాకు నువ్వు రక్ష.. సమాజం మనందరికీ రక్ష.. అనే భావాల ప్రతీక రక్షాబంధనం. ఆపదలో రక్షణగా.. ఆలోచనలో వెన్నుదన్నుగా.. తోడుండాలని తోబుట్టువులు నిండు మనసుతో ఏటా శ్రావణ పౌర్ణమి రోజున అన్నయ్యలు లేదా తమ్ముళ్లకు రాఖీలు కట్టడం సంప్రదాయంగా వస్తోంది. ఇలా రాఖీ కట్టినందుకు సోదరికి సోదరుడు నగదు రూపంలోనో.. ఇతరత్రానో కానుకలు ఇవ్వడమూ ఆనవాయితీగా వస్తోంది.


రాజాం రూరల్: కంచరాం ఉన్నత పాఠశాలలో కూరగాయల విత్తనాలతో విద్యార్థులతో రాఖీలు తయారు చేయిస్తున్న ఉపాధ్యాయులు

రాఖీల సందడి..

జిల్లా అంతటా మార్కెట్లో వివిధ రకాల రాఖీలు అమ్ముడవుతున్నాయి. రూ.పది మొదలుకుని రూ.300 వరకు వీటి ధరలు పలుకుతున్నాయి. సిల్వర్ కోటింగ్ రాఖీలు రూ.150 నుంచి లభ్యం అవుతుండగా.. వెండితో తయారు చేసినవి బరువును బట్టి రూ.600 నుంచి రూ.1000 వరకు ఉన్నాయి. జిల్లాలో ఏటా రూ.కోటి మేర రాఖీలు అమ్ముడవుతాయని ఓ అంచనా. కేవలం సొంత అన్న.. తమ్ముడికే కాకుండా విద్యార్థినులు తాము చదువుకున్న ప్రాంతంలో అన్నా అని పిలిచే ప్రతిఒక్కరికీ రాఖీలు కడుతున్నారు.

కొరియర్ కేంద్రాలకు డిమాండ్..

ఉద్యోగం, ఉపాధి, వివాహం, ఇతరత్రా అవసరాల మీద ఇతర ప్రాంతాల్లో ఉంటన్న అన్నయ్యలు, తమ్ముళ్లకు పోస్టల్ లేదా కొరియర్ ద్వారా రాఖీలు పంపించడం ఆనవాయితీగా వస్తోంది. వారు ఉన్న ప్రాంతాన్ని బట్టి రాఖీలు ప్యాక్ చేసి పంపించేందుకు కొరియర్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా నిర్వాహకులు ఒక్కో కవర్‌కు రూ.50 నుంచి రూ.100వరకు వసూలు చేస్తున్నారు.


రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

విత్తనాలతో రాఖీలు..

రాఖీల తయారీలో విద్యార్థులు కొత్తపుంతలు తొక్కుతున్నారు. మార్కెట్లో అందుబాటులో ఉన్నవి కొంతమంది కొనుగోలు చేస్తుంటే మరికొంతమంది పర్యావరణానికి భంగం కలగకుండా కూరగాయల విత్తనాలు, కలర్ పేపర్స్, దారం తదితర వస్తువులతో రాఖీలు తయారుచేసి తోటి మిత్రులకు పాఠశాలలు, కళాశాలల్లో కడుతున్నారు. ఇవి ఆకర్షణీయంగా ఉంటున్నాయి.

ఒడిశాలో ఉన్న సోదరులకు రాఖీ కట్టిస్తా..



మా కన్నవారి గ్రామం ఒడిశా రాష్ట్రం బొరిగుమ్మ. వివాహం కావడంతో కొన్నేళ్లుగా సాలూరులో ఉంటున్నాను. నేను ఇక్కడ ఉన్నప్పటికీ ఏటా రక్షాబంధన్‌కు మా అన్నయ్య అశోక్, తమ్ముడు సంతోష్‌కు రాఖీలు కట్టిస్తాను. రాఖీల డబ్బులు మా అక్కకు ఫోన్ పే చేస్తాను. ఆమె అక్కడ రాఖీలు కొని నా తరఫున సోదరులకు కడుతుంది. ఆ సమయంలో నేను ఫోనులో వారికి శుభాకాంక్షలు చెబుతాను. ఇలా మా అనుబంధాన్ని కొనసాగిస్తున్నాం.

-వారణాశి పద్మావతి, గృహిణి, సాలూరు

ప్రతి ఏటా రాఖీ కడతా..



మా అమ్మకు నేనొక్కదానినే సంతానం. మా పిన్నమ్మ, పెద్దమ్మల కుమారులైన అన్నయ్యలు ఉన్నారు. వారికి ఏటా రాఖీలు కడతాను.

-గిడిజాల సూర్యకళ, గృహిణి, సాలూరు

అన్నయ్య అంటే ఎంతో ఇష్టం..



అన్నయ్య అంటే ఎంతో ఇష్టం. అందుకే రాఖీ పండగ వస్తే తప్పకుండా రాఖీ కట్టి హారతి ఇస్తాను. అన్నయ్య కూడా రాఖీ పౌర్ణమి ఎప్పుడొస్తుందా అని ఆగస్టులో ఎదురు చూస్తాడు. ఇది మాకు ఎంతో ఇష్టమైన రోజు.

-గంగవంశం చరిష్మా, 9వ తరగతి, మామిడిపల్లి

న్యూస్ బాక్స్

విష ప్రచారం తగదు

రాజాం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌పై వైసీపీ నేతల విష ప్రచారం మాననుకోవాలని స్థానిక టీడీపీ నేతలు హెచ్చరించారు. ఈమేరకు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల వైసీపీ మీడియాలో చేస్తున్న విషప్రచారాన్ని అన్నాక్యాంటిన్‌లో పేదలు భోజనాలు చేస్తున్న ఫోటోను ఆధారాలతో నిరూపించారు. తప్పుడు ప్రచారం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో టౌన్‌వర్కింగ్ ప్రెసిడెంట్ టంకాల కన్నంనాయుడు, కార్యదర్శి శాసపు రమేష్‌కుమార్, ఎం.శ్రీను, నేతలు గున్నం నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

రేగిడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్న ప్రభుత్వానికి నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి పందూరి రమణమూర్తి మాట్లాడుతూ మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో పాటు బీజేపీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మండల సమావేశం

రాజాం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులకు తమ వివరాలతో హాజరు కావాలని సూచించారు.

కాలువలు శుభ్రం చేయరూ

ఎస్.కోట రూరల్ ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం పంచాయతీ పరిధిలో ఉన్న యాత వీధిలోని కాలువల్లో పూడిక తీసి రెండేళ్లవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మురుగునీరు నిలువ ఉండి..దోమలకు నిలయంగా మారిందని ఆరోపిస్తున్నారు. దీని వల్ల స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారని చెబుతున్నారు. అధికారులు స్పందించి.. కాలువల్లో పూడిక తొలగించాలని వారంతా కోరుతున్నారు.

వేపాడలో భారీ వర్షం

వేపాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, చామలాపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. సాయంత్రం 5.30 గంటలు దాటిన తరువాత ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ వర్షం వరి పంటకు ఎంతో మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను తెలపండి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శుక్రవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రచార సామగ్రిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో సెల్ఫీ స్టాండ్లు అమర్చామని...అక్కడ క్యూఆర్ కోడ్ ఉంటుందని తెలిపారు. సెల్ఫీలు తీసుకున్న ప్రతి ఒక్కరూ క్యూర్ కోడ్‌కు తమ ఫొటోలు పంపాలని కోరారు. అలాగే ప్రశంసాపత్రాలు కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని వివరించారు. శుక్రవారం నుంచి ఆగస్టు 15 వరకూ వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్‌ఓ సింహాచలం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో ఎరువుల పంపిణీ

సంతకవిటి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు అందజేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టీడీపీ రాజాం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు వల్లూరు గణేష్ అన్నారు. శుక్రవారం తాలాడ రైతు సేవా కేంద్రంలో ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు ఎరువులు కొనుగోలు చేయాలని కోరారు. ఆయనతో పాటు వ్యవసాయాధికారి బెవర అచ్యుతరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఆక్రమణల తొలగింపు



తొలగించిన దుకాణాలు

భోగాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సవరవల్లి సమీపంలో జాతీయ రహదారి 16 పక్కన గల ఆక్రమణలను సంబంధిత అధికారులు శుక్రవారం తొలగించారు. సవరవల్లి సమీపంలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే సర్వీసు రహదారిని ఆనుకొని ఉన్న ప్రాంతంలో గల ఆక్రమణలను హైవే సిబ్బంది జేసీబీతో తొలగిస్తున్నారు. దీంతో అక్కడ గత కొంత కాలంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న వారు గగ్గోలు పెడుతున్నారు. అక్కడ దుకాణాలు పెట్టుకొని బతుకుతున్నామని... ఈ ఆధారం లేకుండాపోతే ఎలా బతకాలంటూ కన్నీరు పెడుతున్నారు. మహరాజపేట నుంచి అయినా, సుందరపేట సమీపం నుంచైనా ఆక్రమణలు తొలగించుకొంటూ రావాలని...అవన్నీ వదిలేసి..ఇక్కడే తొలగించడం అన్యాయమని అంటున్నారు. అయితే ఇప్పటికే ఆక్రమణలపై నోటీసులు అందించామని...ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగిస్తున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. మరో పది రోజుల్లో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని... లేదంటే తామే తొలగిస్తామని వారు స్పష్టం చేశారు. కలెక్టర్ డా.బి.ఆర్ .అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఎన్‌హెచ్ పీడీ ప్రభాత్‌రాజన్ ఆదేశాలతో తొలగింపు కార్యక్రమం చేపట్టినట్టు ఎన్‌హెచ్ ఇన్‌స్డెంట్ మేనేజర్ రామస్వామి, పణీంద్రబాబులు తెలిపారు.

విద్యుత్ స్తంభాల సమస్య పరిష్కరించండి


ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు సమస్యలను వివరిస్తున్న ప్రజలు

విజయనగరం రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని గాంధీ నగర్, మజ్జిపేట, ప్రదీప్‌నగర్ ప్రాంతాల్లో 9 విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలో ఉన్నాయని.. ఈ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ ప్రాంతానికి చెందిన టీడీ పీ నాయకురాలు బమ్మిడి ప్రమీల... ఎమ్మెల్యే అదితి గజపతిరాజు దృష్టికి తీసుకువచ్చారు. తన కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక పింఛన్లు, ఇళ్లు, ఇంటి రుణాలు మంజూరు చేయాలని కోరుతూ పలువురు వినతులు ఇచ్చారు. కొత్తపేట, యాదవవీధి, లంకాపట్టణం, రైల్వే స్టేషన్ ఏరియా తదితర ప్రాంతాల నుంచి ప్రజలు స్థానికంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. దీనిలో తమ దృష్టికి వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. వాటిని వివిధ శాఖలకు పంపించి... పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు వివరించారు.

వైసీపీ చేష్టలను ఉపేక్షించేది లేదు


మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నంత కాలం దౌర్జన్యాలకు, రౌడీయిజానికి పాల్పడిన వైసీపీ నాయకులు, ఇప్పుడు కూడా తమదే రాజ్యం అన్నట్టు వ్యవహరిస్తే కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి కార్యాలయంలో దళిత యువకుడిపై దాడి చేయడం దారుణమన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో గూండాల పాలన సాగిందని, ఇకపై అటువంటి అరాచకాలకు రాష్ట్రంలో తావులేదన్నారు. దళిత యువకుణ్ణి హింసించి, వీడియో తీసి, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయడం ద్వారా వైసీపీ నాయకులు పైశాచిక ఆనందాన్ని పొందాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో దళితులపై దాడులు చేయడం, వ్యతిరేకంగా మాట్లాడిన వారిని క్రూరంగా హత మార్చడాన్ని ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని నాగార్జున స్పష్టం చేశారు.

సోదర భావమే సనాతన ధర్మం

చీపురుపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మీయ సోదర భావమే సనాతన ధర్మమని బ్రహ్మకుమారీ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి, రాజయోగిని బీకే అన్నపూర్ణ అన్నారు. చీపురుపల్లి కేంద్రంలో శుక్రవారం జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుత జీవితాన్ని సాగించాలని హితవు పలికారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన వారికి ఆమె రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి కేంద్రం ఇన్‌చార్జి శాంతి అక్కయ్య పాల్గొన్నారు.


రాఖీ కడుతున్న అన్నపూర్ణ

ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

విజయనగరం క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రమాదాల నియంత్రణకు, రహదారి భద్రతపైన ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా ఈనెలలో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, హెల్మెట్‌ధారణ, బ్లాక్ స్పాట్స్ వద్ద కేసులు నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు నమోదు చేసిన కేసుల వివరాలను జిల్లా కేంద్రానికి తెలియజేయాలన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ఇప్పటికే ప్రారంభించామని చెప్పారు. మద్యం తాగి... వాహనాలు నడిపే వాహనదారులను ఉపేక్షించవద్దని ఎస్పీ స్పష్టం చేశారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్


కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

శృంగవరపుకోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శివారు పుణ్యగిరి, రేగ పుణ్యగిరి, లోవ గిరిజన గ్రామాల్లో శుక్రవారం స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నాటు తుపాకులు ఉన్నాయేమోనని తనిఖీలు చేశారు. నాటు తుపాకులు కలిగి ఉండడం చట్ట విరుద్ధమని స్థానికులకు వివరించారు. ఎవరి దగ్గరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. అనుమతులు లేకుండా నాటు తుపాకులు కలిగి ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సేరిపేటలో ..

గరివిడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సేరిపేట గ్రామంలోని ఎరుకుల కాలనీలో శుక్రవారం చీపురుపల్లి సీఐ శంకరరావు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీలో అక్రమంగా ఎవరైనా లైసెన్సులు లేకుండా నాటు తుపాకులు కలిగి ఉంటే స్వచ్ఛందంగా అప్పగించాలని కోరారు. వారి వద్ద రూ.15 వేల విలువచేసే మందు గుండు సామగ్రి నిల్వను కొనుగొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు సంచరించినా, అక్రమంగా లైసెన్సులు లేని ఆయుధాలు కలిగి ఉన్నా, గంజాయి వంటి మత్తు పదార్థాలు కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో గరివిడి ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు, గుర్ల ఎస్‌ఐ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ తదితరులు

జాతీయ స్థాయిలో సహకారం అందిస్తాం


మాట్లాడుతున్న వికాస్‌పాండే

ఎస్.కోట రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో 46 రోజులుగా శాంతియుత దీక్ష చేస్తున్న జిందాల్ నిర్వాసితులకు జాతీయ స్థాయిలో సహకారం అందిస్తామని జాతీయ వినియోగదారుల హక్కుల సంఘ చైర్మన్ వికాస్‌పాండే తెలిపారు. శుక్రవారం ఆయన జిందాల్ నిర్వాసితులను కలిసి సంఘీభావం తెలియజేశారు. అనంతరం వికాస్‌పాండే మాట్లాడుతూ నిర్వాసితుల భూములు తిరిగి రావడంతో పాటు ప్రస్తుత ధరల ప్రకారం పరిహారం అందుతుందని తెలిపారు. అవసరమైతే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో జిందాల్ నిర్వాసితులు, స్థానిక పంచాయతీల పెద్దలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న సురేష్

గజపతినగరం, ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లకు తీరని నష్టం వాటిల్లుతుందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కోరారు. శుక్రవారం టాటా ఏసీ మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు సీఐటీయూ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బందులకు గురికావలసి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనమిత్ర పథకం కింద ప్రతి డ్రైవర్ అకౌంట్‌లో రూ.15వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై ఈ నెల 11న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు చైర్మన్లు, సభ్యుల నియామకం

శృంగవరపుకోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట, బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల పరిధిలోని 12 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఒక్కో చైర్మన్, ఇద్దరు సభ్యుల చొప్పున నియమించారు. కృష్ణమహంతి పురం పీఏసీఎస్ చైర్మన్‌గా ఎం.శ్రీను నియమితులయ్యారు. ఆ వివరాలు...

నియోజకవర్గాల వారిగా చైర్మన్‌లు, సభ్యుల వివరాలు..

పార్లమెంటు నియోజకవర్గం	శాసనసభ నియోజకవర్గం	మండలం	పీఏసీఎస్	చైర్మన్	మెంబర్-1	మెంబర్-2
విశాఖపట్నం	శృంగవరపుకోట	శృంగవరపుకోట	కృష్ణమహంతిపురం	మెడపురెడ్డి శ్రీను	పి.రమణబాబు	ఇందుకూరి శ్రీనివాస రాజు
		కొత్తవలస	కొత్తవలస	కోళ్ల వెంకట రమణ	బూసాల సూర్యనారాయణ	జి.పి.నాయుడు
		వేపాడ	వేపాడ	గొంప కృష్ణ	జి.దేముడు బాబు	మంచిన అప్పలసూరి
		జామి	జామి	పెనుమత్స వెంకటరమణ	ఎర్ర కృష్ణ	బి.సన్యాసినాయుడు
విజయనగరం	గజపతినగరం	జామి	అన్నంరాజుపేట	ఇ.అప్పలరాజు	కె.సూర్యనారాయణమ్మ	బి.నారాయణమ్మ
	బొబ్బిలి	బొబ్బిలి	కలవరాయి	జి.రఘు	ఐ.సీహెచ్.నాయుడు	వాకాడ పైడంనాయుడు
			చింతాడ	కర్రి అప్పలనాయుడు	బి.సత్యనారాయణ	బి.లక్ష్మి
		బాడంగి	బాడంగి	ఎల్. సత్యం	ఎల్.అప్పలనాయుడు	ఎన్.సత్యనారాయణ
		తెర్లాం	తెర్లాం	ఎస్.వెంకటేష్	శంకరరావు	ఎస్.అప్పలనాయుడు
		తెర్లాం	పెరుమాళి	కె.జగ్గరాజు	ఎ.పరశురాం	సీహెచ్ శ్రీనివాస్
		రామభద్రపురం	ఆరికతోట	జె.ప్రసాదరావు	ఎస్.ప్రసాద్	ఎం.కృష్ణమూర్తి
			కొట్టక్కి	ఎం.రాంబాబు	పి.ఆర్.నాయుడు	ఎం.జయలక్ష్మి

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

క్రైం న్యూస్

రెండు లారీలు ఢీ: ఒకరి మృతి


ప్రమాద ఘటన దృశ్యం

బొండపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బిల్లలవలస జంక్షన్ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. ఎస్‌ఐ యు.మహేష్ తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌ఘడ్ నుంచి విశాఖపట్నానికి బియ్యం లోడుతో వెళుతున్న లారీ విశాఖ నుంచి జార్ఖండ్ ఐరెన్ ఓర్‌తో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్‌లోని చీడీ జిల్లాకు చెందిన సందీప్ (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ మహేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురిటిపెంటలో చోరీ


ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

గజపతినగరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పురి టిపెంట గ్రామంలోని మామి డిబంద కాలనీలోని తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. స్థానిక ఎస్ఐ. కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన బెహరా వెంకటకృష్ణ గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో సుమారు 4తులాల బంగారం, వస్తువులు చోరికి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. విజయనగరం నుంచి క్లూస్ టీమ్ వచ్చి... వేలిముద్రలను సేకరించింది.

65 బస్తాల బియ్యం పట్టివేత

లక్కవరపుకోట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 65 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్టు ఎస్‌ఐ నవీన్‌పడాల్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జామి, ఎల్.కోట మండలాల్లో సేకరించిన కోటా బియ్యాన్ని నిల్వ ఉంచి ఎస్.కోట నుంచి విశాఖపట్టణం తరలిస్తుండగా గొల్జాం జంక్షన్ వద్ద పట్టుకున్నట్టు తెలిపారు. విశాఖపట్టణానికి చెందిన పి.సురేష్, సాయి ఇద్దరూ కలిసి సుమారు 32.50 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నారని తెలిపారు. వీరిద్దరిపై కేసు నమోదుచేసి కోర్టు లో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాటు తుపాకీ స్వాధీనం

కొత్తవలస, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రామలింగపురం గ్రామంలో శుక్రవారం నాటు తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన దమ్ము దేముడు వద్ద నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. అయితే తనకు లైసెన్స్ ఉందని అతను చెప్పడం గమనార్హం. మరో వ్యక్తి నుంచి కూడా స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఇంకెవరి వద్దనైనా నాటు తుపాకులు ఉన్నాయోమోనని ఆరా తీస్తున్నారు.

గేదెలపై విష ప్రయోగం

వేపాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జాకేరు గ్రామానికి చెందిన సాకలి సత్యారావుకు చెందిన రెండు గేదెలు విష ప్రయోగంతో మృతిచెందినట్టు బాధితుడు తెలిపారు. పశువులు ఆహారం తినే పాత్రలో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపినట్టు ఆరోపిస్తున్నాడు. పాడి గేదెల మృతితో బాధితుడు లబోదిబోమంటున్నాడు.

బాధితురాలికి ఆభరణాల అప్పగింత


బాధితురాలికి ఆభరణాలు అప్పగిస్తున్న ఎస్‌ఐ సురేంద్రనాయుడు

విజయనగరం క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కామాక్షి నగర్‌కు చెందిన పిళ్లా పద్మ సొంత పనుల నిమిత్తం ఈ నెల 7న సాయంత్రం కామాక్షినగర్ వద్ద ఆటో ఎక్కి... రైల్వే స్టేషన్ వద్ద దిగిపోయారు. ఆటోలో ఆమె బ్యాగు మరిచిపోయినట్టుగా గుర్తించి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్రైం ఎస్‌ఐ సురేంద్ర నాయుడు, సిబ్బంది సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఆటోను, అందులో ఉన్న బ్యాగును గుర్తించారు. బ్యాగులోని ఆరు తులాల బంగారు ఆభరణాలను పద్మకు శుక్రవారం వన్‌టౌన్ స్టేషన్‌లో అప్పగించారు. ఆభరణాలను అప్పగించడంలో క్రియాశీలకంగా పనిచేసిన ఎస్‌ఐ సురేంద్రనాయుడు, సిబ్బందిని సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి అభినందించారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

HOUSE FOR SALE
» కేవలం 38లక్షల మాత్రమే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2 & 3 BHK ఇండివిడ్యువల్ హౌస్, 167 గజాల స్థలంలో, వుడా అప్రూవల్ కలిగినట్లు లేఅవుట్ లో కలదు సంప్ర : 9848777589
AJV_241510

స్థలం అమ్మబడును
★ విజయనగరం మున్సిపాలిటీ పరిధిలో గల అయ్యన్నపేట పరిధిలో శ్రీ అష్టలక్ష్మి నగర్ నందు గల 167చ.గజాలు స్థలము అమ్మకమునకు కలదు. సెల్: 9705060876

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

ప్రకృతి ఒడిలో.. ఆదివాసీ జీవనం!

(ఐదో పేజీ తరువాయి)



గిరిజనుల పంటలు

పెట్టుబడితో ఎంతోకొంత లాభాన్ని ఆర్జిస్తారు. అయితే వారు సేకరించే అటవీ ఉత్పత్తులకు మాత్రం ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర రావడం లేదు.

● గిరిజనులు పండించే పంటల్లో ప్రధానంగా గంటెలు, సామలు, నువ్వులు, ఒలుసులు, జునుములు, రాగులు, ఉలవలు, కొర్రలు, బొబ్బర్లు అధికంగా ఉంటాయి. కొండపోడు, మెట్టు భూముల్లో వీటిని ఎక్కువగా పండిస్తారు. గిరిజనులు పండించే మిల్లేట్స్‌కు మైదాన ప్రాంతంలో మంచి గిరాకీ ఉంది. దీంతో ఈ పంటల ద్వారా తమ ఆర్థికస్థితిని మెరుగుపరుచుకుంటున్నారు.

● ఆదివాసీలు ఎంతో ప్రియంగా ఆకుకూరలను పండిస్తుంటారు. ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించరు. సేంద్రియ పద్ధతుల్లో పండిందచే ఆకు కూరలను వీరెంతో ఇష్టంగా తింటారు. గోంగూర, బోదంటెం కూర, గుడంకూర, అడవిదొండ, అంగాకరకాయలు, చేదుకూర, మునగకూరలతో పాటు దుంపజాతికి చెందిన కండ, గోని, అరిక, చేదు దుంపలు, కర్ర పెండ్లం, చార దుంపలను ఎక్కువగా పండిస్తుంటారు. అడవిలో దొరికే వెదురును వండుకొని తింటారు. అంతేకాకుండా పుల్లేరు చీమలతో రకరకాల వంటలను వండుతారు.

మూలికా వైద్యమే రక్ష

గిరిశిఖర గ్రామాల్లో నివసించే ఆదివాసీలు నేటికీ మూలికా వైద్యాన్నే నమ్ముతుంటారు. జలుబు, దగ్గు, జ్వరం, ఇతరాత్ర ఏ వ్యాధులైనా గ్రామాల్లో మూలికావైద్యులను ఆశ్రయిస్తారు. ముఖ్యంగా పచ్చకామెర్లు, అతిసారం, చర్మవ్యాధులు, విషజ్వరం, విరిగిన అవయవాలకు కట్టు కట్టడం, మూలశంక, మొలలు, మూర్ఛ, మలబద్దకం, దగ్గు వంటి వ్యాధులకు వివిధ రకాల మూలికల ద్వారా రోగులకు వైద్యం అందిస్తారు. కొండ ప్రాంతంలో లభించే అరటి, జమ్మిరాజు మొక్క, పాతాళగిరడ, నేరేడుతో పాటు పాముకాటుకు నాగసారం వంటి మూలికలను ఉప యోగించి వైద్యం అందిస్తారు. అయితే ఈ మూలికా వైద్యాన్ని బయటవారు నమ్మకపోయినప్పటికీ ఆదివాసీలు మాత్రం అమితంగా విశ్వసిస్తుంటారు.

అదే తీరు.. అనేక ఆరోపణలు!

(5వ పేజీ తరువాయి)

విఫలమయ్యారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించి 2001, జూలై 16న ఏసీబీ ఆయనపై కేసు నమోదు చేసింది. ఇక 2014 సీతంపేటలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా శ్రీనివాస్ పనిచేశారు. ఒక చిన్న కాంట్రాక్టర్ దగ్గర రూ.3 వేలు లంచాన్ని డిమాండ్ చేశారు. అప్పట్లో చెక్కు రూపంలో జూనియర్ అసిస్టెంట్ సదరు కాంట్రాక్టర్ నుంచి రూ.3 వేలు తీసుకుని ఏసీబీ అధికారులకు చిక్కారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రోద్బలంతోనే తాను చెక్కు తీసుకున్నట్లు జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా అప్పట్లో పనిచేసిన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు. ఇప్పటికీ ఈ కేసు ఏసీబీ కోర్టులోనే ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్వతీపురం ఐటీడీఏలోని సూపరింటెండెంట్ ఇంజనీర్... తన మాట వినడం లేదని మన్యం జిల్లా నుంచి ఆ పోస్టును తొలగించారు. గతంలో ఒక కాంట్రాక్టర్ చేసిన మోసంలో పార్వతీపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ని సస్పెండ్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఇలా ఎంతో మంది శ్రీనివాస్ తీరుతో ఇబ్బందులపాలయ్యారు.

గ్రామాల్లో కార్డన్ సెర్చ్



రావివలస గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ

బాడంగి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రావివలస గ్రామంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనధికారికంగా నాటు తుపాకులు, తూటాలు ఎవరి వద్దా ఉండకూడదన్న నిబంధనతో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించినట్టు బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు తెలిపారు. ఆ తనిఖీల్లో ఎటువంటి ఆయుధాలు లభ్యం కాలేదని ఆయన చెప్పారు. ఈ తనిఖీల్లో సీఐతోపాటు స్థానిక ఎస్ఐ తారకేశ్వరరావు, రామభద్రపురం ఎస్ఐ వి.ప్రసాదరావు, 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● సీతంపేట రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుమూల గ్రామమైన కొత్తవలసలో శుక్రవారం ఎస్ఐ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల పరిసరాల్లో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ లైసెన్స్‌లు లేకుండా నాటుతుపాకీలు వినియోగించడం చట్టరీత్యా నేరమని అన్నారు. అక్రమంగా నాటు తుపాకీలు కలిగిఉన్న వారు వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాలని ఆయన సూచించారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 11వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక నవోదయ నగర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కార్యదర్శి బీవీ రమణ పాల్గొని, మాట్లాడారు. సీఐటీయూ జిల్లా మహాసభలు పాలకొండలో సెప్టెంబరు 13, 14 తేదీల్లో జరుగనున్నాయని, 13వ తేదీన బహిరంగ సభ ర్యాలీ జరగనుందని చెప్పారు. డిసెంబరు 31, జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో సీఐటీయూ అఖిలభారత మహాసభలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సభలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కాద రాము, ఆర్తమూడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించండి

మక్కువ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.కృష్ణారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన వీఆర్ఏల సంఘ సమావేశం నిర్వహించారు. వీఆర్ఏలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాన్నరు. 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఆయన వీఆర్ఏలకు పిలుపునిచ్చారు. ఈనెల 13, 14వ తేదీల్లో పాలకొండలో జరిగే సీఐటీయూ మహాసభలకు వీఆర్ఏలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చెయ్యాలన్నారు. అనంతరం ఆయన వీఆర్ఏల సంఘం ఎన్నికలు నిర్వహించారు. మక్కువ మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడిగా జి.పవన్‌కల్యాణ్, ఉపాధ్యక్షుడిగా డి.సింహాచలం, కార్యదర్శిగా కె.సింహాచలం, కోశాధికారిగా బి.పార్వతి ఎన్నికయ్యారు.

సమస్యల వలయంలో మరుపల్లి పీహెచ్‌సీ

● అదనపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవనం లేని వైనం

● ఒకేచోట వైద్యులు విధుల నిర్వహణ

● ఇబ్బంది పడుతున్న రోగులు

గజపతినగరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మరుపల్లి పీహెచ్‌సీలో సమస్యలు తిష్ఠ వేశాయి. సాధారణంగా 30వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ అవసరం. అయితే 60వేలు పైబడి ఉన్న గజపతినగరం మండలానికి మరుపల్లిలో గల పీహెచ్‌సీ నుంచే వైద్యసేవలు అందిస్తూ వస్తున్నారు. గతంలో మండలానికి అదనపు పీహెచ్‌సీ మంజూరు చేయాలని వైద్యుల డిమాండ్ మేరకు 2019లో అప్పటి టీడీపీ హయాంలో జిన్నాం గ్రామంలో అదనపు పీహెచ్‌సీకి ప్రతిపాదనలు చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అదనపు పీహెచ్‌సీని జిన్నాంలో మంజూరు చేయకుండా.. స్థానిక సీహెచ్‌సీలోనే అదనంగా ఒక గదిని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం సీహెచ్‌సీ ఏరియా ఆసుపత్రిగా మారడంతో అక్కడ ఉన్న గది చాలడం లేదు. అలాగే సిబ్బందిని కూడా పూర్తి స్థాయిలో నియమించక పోవడంతో రోగులు వైద్యసేవలకు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీకి గాను గతంలో ఇద్దరు వైద్యులు ఉండగా, అదనపు పీహెచ్‌సీకిగాను మరో ఇద్దరు వైద్యులను నియమించారు. ఈ నలుగురు వైద్యులు మరుపల్లి పీహెచ్‌సీలో ఉంటూ సేవలు అందిస్తున్నారు. దీంతో మరుపల్లి పీహెచ్‌సీపై అదనపు భారం పడుతోంది. అయితే నలుగురు సూపర్‌వైజర్లు ఉండాల్సి ఉండగా, ఇద్దరు మాత్రమే ఉన్నారు.

తప్పని వ్యయప్రయాసలు

మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా వైద్య సేవలకు గాను మరుపల్లి పీహెచ్‌సీనే ఆశ్రయిస్తున్నారు. దీంతో వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తోంది. మండలంలో 30 పంచాయతీలు.. 63,579 మంది జనాభా ఉంది. మొత్తం మండలానికి మరుపల్లి పీహెచ్‌సీ నుంచే వైద్య సేవలు అందించాల్సి వస్తోంది. అదనంగా 104 సేవలకు రోజుకొక వైద్యాధికారి వెళ్లాల్సి ఉంటుంది. పీహెచ్‌సీ పరిధిలో 21 గ్రామ సచివాలయా లకు నలుగురు హెల్త్ అసిస్టెంట్లకుగాను ఒక్కరే ఉన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు మరుపల్లి, ముచ్చర్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత వల్ల అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.



మరుపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం

మరుపల్లి పీహెచ్‌సీ సమస్యలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లాం. అలాగే జిల్లా అధికారుల కు తెలియజేశాం. కోలోకేటెడ్ అదనంగా మంజూరు చేసి నా ఏరియా ఆసుపత్రిలో ఇచ్చిన భవనం చాలక మరు పల్లి పీహెచ్‌సీలోనే నలుగురు వైద్యులూ సేవలు అందిం చాల్సి వస్తోంది. దీంతో రోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అదనపు పీహెచ్‌సీకి భవనం మంజూరు చేయాలని కోరుతున్నాం.

- సాయికృష్ణారెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి, మరుపల్లి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

పాలకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బడుగుల బలహీన వర్గాల అభ్యున్నతే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. పాలకొండలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ పార్వతీపురం మన్యం జిల్లా ద్వితీయ మహాసభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. 2025 డిసెంబరు నాటికి సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని చెప్పారు. భూమి కోసం, భుక్తి కోసం ఉద్యమాలు చేపట్టిన ఘనత సీపీఐకి దక్కుతుందన్నారు. కొత్తగా ఏర్పడిన మన్యం జిల్లా అభివృద్ధి శూన్యమన్నారు. తోటపల్లి పూర్వపు ఎడమ, కుడి కాలువల ఆధునికీరణలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. జంఝావతి ప్రాజెక్టుకు అర్ధ శతాబ్దం కావస్తున్నా నేటికీ శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదన్నారు. వెంగలరాయసాగర్, పెద్దగెడ్డ, జంపరకోట రిజర్వాయర్, కారిగెడ్డ, అడారిగెడ్డ, గుమ్మడిగెడ్డ తదితర రిజర్వాయర్ పనులు తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు, దళితులకు భూములు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. ఆగస్టు 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని తెలిపారు. అంతకుముందు స్థానిక కోటదుర్గమ్మ ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా గాయత్రీ కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ సమయంలో



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ పట్టణం ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామేశ్వరరావు, ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, కూరంగి మన్మధరావు, కె.రామకృష్ణ, జేవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

బొబ్బిలి రాజా రంగారావు శతజయంతి

బొబ్బిలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రాజా ఆర్‌వీజీకే రంగారావు అటు రాజరికంలో, ఇటు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన స్థితిని అనుభవించిన ఘనతను దక్కించుకున్నారని ఆయన తనయుడు, ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. రాజా ఆర్‌వీజీకే రంగారావు శతజయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోరాడ వీధిలో ఏర్పాటుచేసిన రాజా విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం సంతాప సభ నిర్వహించారు. అన్నదానం తదితర సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక రాజా ఆర్ఎస్ఆర్‌కే రంగారావు కళాశాలలో ఏర్పాటు చేసిన శత జయంతి ఉత్సవాలలో బేబీనాయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాయల్ ఫ్యామిలీలో పుట్టినప్పటికీ నిరాడంబరతకు నిలువుటద్దంగా తమ తండ్రిగారు నిలిచారు. ఆయన చూపిన బాటలో తమ ముగ్గురు అన్నదమ్ములం నడుచుకుంటున్నామని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ ఐవీ రామకృష్ణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ డి.రఘునాథరావు, గోనా అప్పారావు, ప్రిన్సిపాల్ వీరేంద్రకుమార్ తదితరులు రాజా సేవలను కొనియాడారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ డ్యాన్సులు, పలు రకాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ అంజలీదేవి, రావు బదరి, కంప్యూటర్ హెడ్ మండల రమేష్, ఇంగ్లీషు హెడ్ డాక్టర్ చోడిగంజి రవి తదితరులు పాల్గొన్నారు.



రాజా రంగారావు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

మూణ్నాళ్ల ముచ్చటే..

● రామభద్రపురం హైస్కూల్ ప్లస్‌లో చేరేందుకు విద్యార్థుల విముఖత ● బాడంగికి తరలింపు

రామభద్రపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత విద్యా సంవత్సరంలో ఏర్పాటుచేసిన ఇంటర్ కళాశాల మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. దీంతో ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న విద్యార్థులకు ఇంటర్ కోర్సు అర్ధాంతరంగా ముగిసిపోయింది. స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 2024-25 సంవత్సరానికి హైస్కూల్ ప్లస్ పేరుతో ఒక భవనంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో సుమారు 18 మంది విద్యార్థులు చేరినప్పటికీ ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు కంటే ఎక్కువ హాజరయ్యేవారు కాదు. అయితే ఈ కళాశాలకు ఎటువంటి మౌలిక సౌకర్యాలు కల్పించలేదు. అలాగే అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించలేదు. అరకొర వసతులతో హడావిడిగా ప్రారంభోత్సవం చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను డిప్యూటేషన్‌పై తీసుకువచ్చి క్లాసులు నిర్వహించేవారు. అంతేకాకుండా ఒక్క సెక్షన్ మాత్రమే నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఈ కళాశాలలో చేరేందుకు ఇష్టపడేవారు కాదు. బొబ్బిలి డివిజన్‌లో మొదటిగా బొబ్బిలి మండలం పిరిడి, రేగిడి వెంకటరావుపురం, రామభ ద్రపురం ప్రాంతాల్లో ఈ హైస్కూల్ ప్లస్ కళాశాలలు ఏర్పాటు చేశారు. కళాశాలలో చేరినా హైస్కూల్ వాతావరణం ఉండడం, ఒక భవనంలోనే తరగతులు నిర్వహించడం వంటి లోపాల కారణంగా ఇందులో చేరడానికి విద్యార్థులు సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో ఈ ఏడాది హైస్కూల్ ప్లస్ కళాశాలను మూసివేసి గత ఏడాది మొదటి సంవత్సరం లో చేరిన విద్యార్థులను బాడంగి జూనియర్ కళాశాలకు తరలించారు.





రామభద్రపురం ఉన్నత పాఠశాల, హైస్కూల్ ప్లస్ పేరుతో ఏర్పాటు చేసిన గది

లోపాలను వెలికి తీసేందుకే సామాజిక తనిఖీలు

గరుగుబిల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధిలో నెలకొన్న లోపాలను వెలికి తీసేందుకే ప్రభుత్వం సామాజిక తనిఖీలు ఏర్పాటు చేసిందని రాష్ట్ర ఎస్ఆర్‌పీ ఈదుబిల్లి పున్నపునాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని నాగూరు, తోటపల్లి, గొట్టివలస పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా 25 పంచాయతీల పరిధిలో నిర్వహించిన పలు రకాల అభివృద్ధి పనులను పరిశీలన చేస్తున్నామని చెప్పారు. పరిశీలన అనంతరం గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలానికి సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను సుమారు రూ.20 కోట్లు వ్యయం జరిగిందన్నారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 8,090 మేర పరిశీలన చేశామన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు సక్రమంగా జరిగాయో లేదోనన్న సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ గ్రామసభల్లో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, అశోక్‌కుమార్, ఉపాధి సిబ్బంది సీహెచ్ రుద్రకోటేశ్వరరావు, డీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

అరుదైన నాగు



భామిని, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భామిని గ్రామ శివారున గల ఖాళీ స్థలంలో శుక్రవారం ఒక అరుదైన నాగుపాము కనిపించింది. గోదుమ రంగులో పెద్ద పడగ విప్పి స్థానికులకు దర్శనమిచ్చింది. కొంతసేపటి తర్వాత పొదల్లోకి వెళ్లిపోయింది. ఇటువంటి పాములు జనావాసాల్లో తిరిగితే చాలా ప్రమాదకరమని స్థానికులు భయపడుతున్నారు.

దుకాణాల్లో పరిశుభ్రత లేకుంటే జరిమానా

సాలూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో పరిశుభ్రత లేకున్నా, పాలిథిన్ కవర్లు వినియోగించినా జరిమానా తప్పదని సాలూరు మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం సాలూరు మున్సిపల్ కమిషనర్ టీటీ రత్నకు మార్ ఆదేశాల మేరకు ఆయన తన సిబ్బందితో సాలూరు చినమార్కెట్, పెదమార్కెట్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా దుకాణాదారులకు పరిశుభ్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. పలు వీధుల్లో మహిళలు చెత్తాచెదారాన్ని రోడ్డుపై, కాలువల్లో వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా వేసి ఉదయమే ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ కార్మికులకు అందించాలని కోరారు.



దుకాణాలు తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ

కొఠియాలో ఒడిశా డిప్యూటీ సీఎం పర్యటన

సాలూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం కొఠియాలో ఒడిశా డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడ శుక్రవారం పర్యటించారు. మహిళా సంఘానికి రుణ పంపిణీ చెక్కును అందించారు. కొఠియాలో గ్రూపు గ్రామాల్లో రాష్ట్ర మంత్రులు నిత్యానంద్ గండ్, గోకుల నందమల్లిక్, కొరాపుట్ ఎమ్మెల్యే రామచంద్ర మత్స్య, కోట్పాడ్ ఎమ్మెల్యే రూపు బాత్రో, నవరంగ్‌పూర్ ఎంపీ కలిరాం మఝితో కలసి పర్యటించారు. కొఠియా అభివృద్ధికి రాజీ పడేది లేదన్నారు. ముడకారుకు చెందిన ప్రగతి ఎస్‌హెచ్‌సీ గ్రూపు మహిళలకు రూ.5లక్షల రుణ చెక్కును అందించారు. ఆమెతో కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి, కొరాపుట్ కలెక్టర్ మనోజ్ సత్యావాన్ మహాజన్ ఉన్నారు.

న్యూస్ బాక్స్

గిరిజన ప్రాంతాభివృద్ధికి చర్యలు

● మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఏడాదిలో ఎన్నో చర్యలు తీసుకున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రతి గిరిజన గ్రామానికి పక్కా రహదారి నిర్మించడమే లక్ష్యంగా నిధులు మంజూరు చేశామన్నారు. ఒక్క సాలూరు నియోజకవర్గంలోనే వంద రోజుల్లో వంద రహదారులు నిర్మించిన ఘనత ఉందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కంటైనర్ ఆసుపత్రులు ఏర్పాటు చేశామన్నారు. వసతిగృహాల్లో అవసరమైన వస్తువులు అందిస్తున్నామని తెలిపారు. సీతంపేట తదితర ప్రాంతాల్లో గిరి సూపర్‌బజార్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే జగదీశ్వరి



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం అమరావతిలో కలిశారు. కురుపాం నియోజకవర్గంలో రోడ్ల కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే పీఎం జన్మన్ యోజన పథకం కింద పీవీటీజీ గ్రామాలకు బోర్లు మంజూరు చేయాలన్నారు. శ్రీనిధి కింద మహిళా మండలి గ్రూపులకు రుణాలు ఇవ్వాలని, నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. భద్రగిరి ఆసుపత్రిలో 100 పడకల కోసం నిధులు ఇవ్వాలన్నారు. కుంకి ఏనుగులు కురుపాం నియోజకవర్గం పంపించాలని, ఏనుగులు వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. హాస్టల్‌లో ఏఎన్ఎంలు, సాఫ్ట్‌నర్స్‌లను నియమించాలని, పూర్ణపాడు-లాబేసు వంతెన త్వరగా పూర్తి చేయాలని విన్నవించారు. జీవో నెంబర్-3కి బదులు కొత్త జీవో తెచ్చి గిరిజనులకు ఆదుకోవాలన్నారు. త్వరలో వీటన్నింటినీ అమలు చేస్తానని ఎమ్మెల్యే జగదీశ్వరికి సీఎం చంద్రబాబు హామీనిచ్చారు.

గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలి

మక్కువరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను, భాషను, రిజర్వేషన్లను కాపాడుకోవాలని డి.శిర్లాం పంచాయతీ లోతుగెడ్డ గ్రామ యువకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదివాసీ గిరిజన వారోత్సవాల్లో భాగంగా గ్రామ నాయకుడు సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన జెండాను ఎగురవేశారు. జీవో నెం-3ని వెంటనే అమలుచేసి గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువతతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం మండల కేం ద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 9న ఆదివాసీ దినోత్సవం నిర్వహించానికి గిరిజన సంఘాల సమాఖ్య ఏర్పాట్లు చేస్తోంది. ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి గిరిజన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర గిరిజన సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు హాజరు కావాలని ఆదివాసీ జేఏసీ పిలుపునిచ్చింది.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

